# వింత ప్రకృతి

పొద్దుణ్ణుంచీ వానా, గాలీ విపరీతంగా కమ్ముకుని సూర్యగమనం కనిపించటం లేదు. వాన తుంపరలు పంచలోకి కూడా విసిరివిసిరి కొడుతున్నాయి. బైట పంచవాకిలి ఒరగిల వేసి యానాది సుబ్బి చాప మీద కూచ్చుని స్వర్ణతో మాట్లాడుతోంది. రెవిన్యూ ఇన్‌స్పెక్టర్ సుబ్బారావు క్యాంపుకు పోయాడు. స్వర్ణ ఒక్కతే ఇంట్లో కూచుని టేబిల్ లైట్ ముందు ఏదో పుస్తకం చదువుతూ సుబ్బికి పరధ్యానంగా జవాబు లిస్తోంది.

సుబ్బి ''అమ్మగారూ! ఊర్లో ఏంటో అనుకుంటున్నారండీ, నిజమేనా?'' అని అడిగింది. చలి గాలికి ముసుగు నెత్తి మీదికి లాక్కుంటూ.

''ఏమనుకుంటున్నారేమిటి?'' అని అడిగింది స్వర్ణ. ఆమెలో ఆదుర్దాగాని, భయంగాని ఏ మాత్రం వ్యక్తం కావటం లేదు. సుబ్బి, సాయంత్రపు సూర్యకాంతిలో నీడలో నీడగా కలిసి కూచుని అమ్మగారి కేసి చూస్తూ చెపుదామా, వొద్దా అని ఆలోచిస్తోంది. వాన నిమిష నిముషానికీ ఎక్కువవుతోంది. స్వర్ణ మళ్ళీ అడిగింది తన వెనకటి ప్రశ్నని. దీపం గాలికి ఊగుతోంది. పుస్తకం రెపరెప లాడుతోంది. ఏం రాత్రి... ఈ రాత్రి ఒంటరిగా వుండటం తనదురదృష్టం అనుకుంటోంది ఆమె లోపల. సుబ్బి మర్యాదగా, ''అయ్యగారిని మీరు రెండో పెళ్ళి....'' అని ఇంకేదో అనబోతుంటే స్వర్ణ ఆపి ''ఇదా!'' అంటూ, ''ఓస్! మీ ఏనాది వాళ్లల్లో మారు మనువు లేదుటే? అంతే ఇదీను'' అంది చాలా నిర్లక్ష్యంగా.

సుబ్బి ఆశ్చర్యంగా, ''అయితే బ్రామ్మల్లో గూడా మారుమనువు వుందా యెట్టా?'' అంది గడ్డం కింద చెయ్యి పెట్టుకుని.

''అంతగా లేదు కాని, అవసరమైతే మొగుణ్ణి వొది లెయ్యొచ్చు.''

''అస లెందుకు వొదిలేరండీ? వొదలటం అవినీతి అని కాదు. ఆ కారణం ఎంత బలవత్తరమో అని''

''అదా! లక్ష! అతను వారాలకి వారాలు ఇంట్లో ఉండేవాడు కాదు. ఉన్న రెండు రోజుల్లో కూడా, ఒక పూట కాళ్ళవాపులూ, ఒక పూట తలనొప్పి, ఇవన్నిట్నీ మించి నిద్రమత్తు.

''సరే.''

''అయ్యగారు ఆ వూర్లో కొన్నాళ్ళున్నాడు, మా యింటిపక్కనే, అప్పుడే...''

ఇకపై కథంతా సుబ్బి విన్నదే. సుబ్బి ''అమ్మగారూ! పెందరాళే వణ్ణంతిని పడుకోరాదండి! ఈ వానలో ఇంకేం వస్తారండీ అయ్యగారు?'' అంది.

''ఈ పూటకి వొట్టిదేనంటావా?'' అని అడిగింది నిరాశగాస్వర్ణ.

'' ఆ!'' అంది నిక్కచ్చిగా సుబ్బి.

## 2

భోంచేసి తమలపాకులు నవులుతూ పడకకుర్చీల్లో పడుకుని స్వర్ణ అదే పుస్తకాన్ని ఏమీ యిష్టంలేక పోయినా చదువుతోంది. బయట వానతగ్గే సూచనలేమీ లేవు. గాలి కూడా జోరుగానే వీస్తోంది లోకాన్ని మింగుతా నన్నట్టు. వాకిలిదగ్గిరగా పడుకుంది. గోడ గడియారం పది కొట్టింది. బయట బూట్ల చప్పుడు వినపడ్డది ఆదుర్దాగా. కాని, ఎవరూ తలుపుతట్టలేదు. స్వర్ణ ఉలిక్కిపడి ''ఏవరో చూడవే సుబ్బీ!'' అన్నది.

సుబ్బి తలుపుతీసి చూసింది. ఎవరో ఒకాయన వానకి దడిసి పంచలో నుంచున్నాడు. సూటూబూటూ వేసుకున్నాడు. రూపం కనబడేంత వెల్తురులేదు. సుబ్బి లోపలికి వచ్చి ''ఎవరోనమ్మా వానకి నుంచున్నారు'' అంది.

స్వర్ణ పరధ్యానంగా, ''పాపం, పంచలో జల్లుకి తడుస్తారేమో - లోపలి వేపు నుంచోమను'' అంది.

సుబ్బి తలుపు తెరిచి, ''ఇట్లా లోపలికొచ్చి నుంచోండి'' అంది మర్యాదగా. అవతలి వ్యక్తి ఒక నిమిషం ఆలోచించి లోపలికి వచ్చాడు. లోపలివైపు నుంచి కనపడుతున్న స్వర్ణవైపు చూసి, అతను ఏదో జ్ఞాపకం తెచ్చుకునే ప్రయత్నంలో ఉంటూ, హాండ్ కర్చీఫ్‌తో తల తుడుచుకుంటున్నాడు. దీపపు మందమైన వెల్తుర్లో అతని మొహంలో సంవత్సరాల అనుభవం సినిమాలాగా దొర్లిపోతున్నది. స్వర్ణ ఇక పడుకుందామా, అనుకొని ఈ అతిథిని ఏం చెయ్యాలా అన్నట్లు, మళ్ళీ కూలబడింది. ఆమె నూతనుడివైపు చూడలేదు సరిగ్గా.

నూతనుడు నీడలోంచి వెలుగులోకి వచ్చి,

''ఈ వానలో ఎటూ పోలేకుండా వున్నాను. అవసరమైనప్పుడు వానంటూ కురవదు'' అన్నాడు. అవతలి వ్యక్తికి తన గొంతులో ఏదో స్ఫురించాలన్న ప్రయత్నంతో గాఢంగా వొత్తిపలుకుతూ.

స్వర్ణ ఉలిక్కిపడి, గడపలోనుంచున్న నూతనుణ్ణి తలెత్తి చూసింది. దీపపు కాంతిలో - సుబ్బి, గడప దిగువన నుంచుని యజమానురాలి మొహంలోకి చూస్తోంది అయోమయంగా.

''ఇక్కడే పడుకోనిస్తే మిమ్మల్ని జీవితంలో మర్చిపోలేను'' అన్నాడు కొత్తమనిషి.

''భోంచేశారా?'' అంది స్వర్ణ ఏదో ఆలోచిస్తూ.

''దానికేం లెండి!'' అని తేల్చేయాలని చూశాడు నూతనుడు.

స్వర్ణ సుబ్బివంకకు తిరిగి, ''సుబ్బీ! ఫ్లాస్కు పట్టుకెళ్ళి కాఫీ, ఏదన్నా టిఫిన్ పట్రా - గొడుగు ఆ మూల ఉంది, వేసుకువెళ్ళు'' అంది.

''ఎందుకూ? అక్కర్లేదు'' అంటున్నాడు సూట్ ఆయన.

''ఫర్వాలేదు, వెళ్ళవే సుబ్బీ!'' అంది స్వర్ణ నూతనుణ్ణి, మంచంమీద కూర్చోమని చేత్తో సౌంజ్ఞచేస్తూ.

అపరిచితుడైన ఒకడికి యజమానురాలు చేసే ఈ మర్యాద సుబ్బికి చాలా ఆశ్చర్యం కలిగించినా, 'ఇది ఒకరకం ఉపకారం గామాలు!'' అనుకుంటూ ఫ్లాస్కూ, గొడుగూ పుచ్చుకుని గడప దిగింది.

## 3

''అయితే స్వర్ణా! నువ్వేనా? ఇంకెవరో అనుకుని, ఈ మర్యాదకి అదిరిపోయినాను'' అన్నాడు రాఘవరావు.

''నేనూ నన్ను ఒదిలేసి నువ్వెక్కడున్నావో అని చాలా దిగులుపడ్డాను సుమా!'' అన్నాడు రాఘవరావు, సహజంగా పురుషులు రాత్రి అవసరాలు కావాల్సినప్పుడు స్త్రీలతో మాట్లాడే ఔదార్యత ప్రదర్శిస్తూ.

''ఓహో హో! ఎంత ప్రేమో!'' అంది స్వర్ణ ఎగతాళిగా.

''నేను చెబితే నమ్మలేవులే!'' అంటూనే స్వర్ణ దగ్గరికి నడిచాడు. స్వర్ణ అతన్ని కాస్త తగ్గమని చేత్తో సౌంజ్ఞ చేసి, ''నీతో కాపరం చేసిన రోజుల్లో నా అందం నీకు కనిపించ లేదు కాబోలేం!'' అంది వెటకారంగా.

''ఇటీవల నాలుగురోజులు కాఫీ, సిగరెట్లూ మానాను. ఇవాళ ఉండ బట్టలేక కాఫీ, సిగరెట్లూ కూడా తాగాను. ఎంత బావుందనుకున్నావు!''

''అంతే నంటావా నేనూనూ?'' అని అడిగింది పూర్వపు భార్య.

''కాదూ మరి? ఏదైనా, ఎప్పుడూ ఎదురుగావుంటే దానివిలువ తెలీదు.''

''నాకూ అంతే - పొరుగింటి కూరకి ఎగబడ్డం మానవ లక్షణం.''

''వేదాంతాలు చెప్పకు ఇప్పుడు - ఏం చేస్తున్నావు? ఎక్కడ వుంటున్నావు?'' అంటూ కసుక్కుంది స్వర్ణ.

''ఇదివరకేం చేసేవాణ్ణీ. అంతే ఇప్పుడూనూ! ఈ గుమాస్తాగాడికి ఎవ్వడూ మళ్ళీ పిల్ల నివ్వ న్నాడు. కలలు కంటూ హోటల్లో భోంచేస్తూ బతుకుని ఈడుస్తున్నాను.''

''పాపం!'' అంది స్త్రీ, అనాది నుంచీ ఎంత పోగొట్టు కుందామన్నా సంఘం నేర్పువల్ల వొదలని దయతో.

''కాఫీ తెస్తే తాగి పడివుంటా ఈ పూటకి. రేపట్నుంచీ మళ్ళీ మొదలు ఒంటరి బతుకు. నిన్ను సుఖపెట్టనందుకు ఇదినాకు శిక్షాబోలు!'' అవసరం కొద్దీ పశ్చాత్తాప పడుతున్నాడు పురుషుడు.

''మీకేం, మగాళ్ళు, జేబులో చెయ్యిపెట్టే వొంటరి తనమేం ఖర్మ!'' అంది ఎంత అణచినా లోపల రగులు తున్న జలసీతో.

''అట్లా అనకు, నేనల్లాంటి వాణ్ణయితే నిన్ను ఇంకోడితో లేచిపోనిచ్చి వుండేవాణ్ణికాదు!'' అన్నాడు రాఘవరావు.

సుబ్బి కాళ్ళచప్పుడుతో సంభాషణకి ఫుల్‌స్టాప్ పడ్డది. కాఫీ గ్లాసులో పోసి పూరీల పొట్లం విప్పి, పరిచిత అభ్యాగతుడి ముందు పెట్టి స్వర్ణ లోపలికి పోయింది మంచి నీళ్లు తేవడానికి. సుబ్బికి అయోమయం వదలక పోయినా, గొప్పోళ్ళ సంగతి తనకెందుకని ఆలోచిస్తూ నడవాలో చాప మీద పడుకుంది.

## 4

దీపం తగ్గించి స్వర్ణ మంచం మీద వాలింది. రాఘవరావు సుబ్బి వంక సందేహ నివారణకోసం ఒకసారి చూచి నిద్రపోతోందని తేల్చుకుని మెల్లగా స్వర్ణ దగ్గిరికి నడిచాడు. స్వర్ణ అతన్ని ఏమీ అడ్డు పెట్టలేదు. మంచంమీద కూర్చుని ఆమె వైపుగా వొంగి రాఘవరావు ఆమె పెదాలతో మాట్లాడుతూ, ''నాతో వచ్చేస్తావా, నిన్ను పూజిస్తాను'' అన్నాడు లాలనగా.

స్వర్ణ అర్థస్ఫూర్తిగా మెరిసే కనుపాపల్ని అటూ ఇటూ తిప్పుతో, '' ఒక్కసారికన్న ఎక్కువసార్లు విషం పుచ్చుకోనక్కర్లేదు చూడు!'' అంది అతన్ని బాహువుల్లో బంధిస్తూ.

''మరినన్ను ఇంకే..'' అని ఏదో బూతుమాట అన్నాడు రాఘవరావు.

''ఇది అవసరం. ఈ వానరాత్రి వొంటరితనం నాకు చాలా కష్టంగా వుంది'' అంది గర్వంగా స్వర్ణ.

రాఘవరావు నోరు పెగలక ఆమె వక్షంమీద వెచ్చగా నిద్రపోయినాడు.

*('రక్తస్పర్శ' కథల సంపుటి, 1963)*